క్లుప్తంగా

ముగిసిన దంత వైద్య శిబిరం



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజానగరం: గైట్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల సహకారంతో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం శుక్రవారం ముగిసింది. ఆఖరి రోజు 300 మందికి దంత పరీక్షలు చేసి, 68 మందికి చికిత్సను అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వల్లీమాధవి, దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, ఎన్ఎస్ఎస్ పీఓ కె.కాశీకృష్ణ, ఏఓ ఎస్ఎస్ రాజు, హెచ్ఓడీ రూపేష్, లెక్చరర్ డాక్టర్ మౌనికారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గౌతమి నేత్రాలయం, డెల్టా హాస్పిటల్, రమా డెంటల్స్, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రమేష్ హాస్పిటల్స్ వైద్యులు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, నరములు, కళ్లు, మూత్ర సంబంధిత వ్యాధులు, డెంటల్, బీపీ, సుగర్, జనరల్ వ్యాధులు, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు తెలిపారు.

లైసెన్సుల రెన్యువల్‌కు డిసెంబర్ 19 వరకు గడువు

సీతానగరం: మండలంలోని వర్జీనియా పొగాకు రైతులు తమ బేరన్ లైసెన్సుల రెన్యువల్‌కు పెనాల్టీతో డిసెంబర్ 19 గడువు ఉందని దేవరపల్లి టుబాకో బోర్డ్ ఆక్షన్ సూపరింటెండెంట్ పి.హేమస్మిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతానగరం మండలంలో ఉన్న వర్జీనియా పొగాకు రైతులు తమ లైసెన్సులను దేవరపల్లి టుబాకో బోర్డులో సాధారణ రుసుంతో వచ్చే నెల 25 వరకు రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు. రూ.100 పెనాల్టీతో డిసెంబర్ 9 వరకు, రూ.400 పెనాల్టీతో డిసెంబర్ 19 వరకు టుబాకో లైసెన్సులు రెన్యువల్ చేయించుకోవచ్చని ఆక్షన్ సూపరింటెండెంట్ హేమ స్మిత తెలిపారు. టుబాకో బోర్డు ఫీల్డ్ అసిస్టెంట్ కె.సతీష్ 'సాక్షి'తో మాట్లాడుతూ సీతానగరం మండలంలో రైతులకు బ్లాక్ సాయిల్ లైసెన్సులు 1,000 వరకు ఉన్నాయని, ఇందులో సుమారు 600 వరకు లైసెన్సులు రెన్యువల్ అయ్యాయని తెలిపారు. మిగిలిన 400 బేరన్ లైసెన్సులు గడువులోగా రెన్యువల్ చేయించుకోవాలని కోరారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ఖాసిం

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టం 2005పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు మాట్లాడుతూ ఈ చట్టం గురించి ప్రతి పౌరుడు తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. అవగాహన ఉంటేనే హక్కులను సద్వినియోగపర్చుకోగలుగుతామన్నారు. ఈ చట్టం ద్వారా సమాచారాన్ని ఏవిధంగా పొందవచ్చును, అందుకు సంబంధించిన విధి, విధానాలపై మండల వ్యవసాయాధికారి ఎస్కే ఇమామి ఖాసిం వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి దివ్యశ్రీ, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వీరవెంకటనరసింహరావు, డాక్టర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి మరో అద్దె బస్సు


బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

మధురపూడి: గోకవరం ఆర్టీసీ డిపోనుంచి రాజమహేంద్రవరం నడిచే మరో అద్దెబస్సును ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. కోరుకొండ ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద నిర్వహించిన ప్రారంభం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్టీసీ గోకవరం డిపో మేనేజర్ యు.రామన్నదొర, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎ.అప్పారావు, బస్సు యజమాని సుబ్రహ్మణ్యం, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చుక్కల్లో కూరగాయలు


మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న మహిళలు

- అధిక వర్షాలతో భారీగా పెరిగిన రేట్లు
- దీపావళి వెళ్లే వరకు ఇలాగే ఉంటాయంటున్న వ్యాపారులు

రాజానగరం: ఈ ఏడాది అవసరానికి మించి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మార్కెట్‌లో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. భారీ వర్షాలతో కూరగాయల సాగుకు నష్టం వాటిల్లడంతోపాటు రవాణాకు కూడా అంతరాయం ఏర్పడటమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని జీవులకు ఈ ధరల మోత మరీ భారంగా మారింది. రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ము ప్రస్తుత పరిస్థితులతో కూరగాయలు కొనడానికి కూడా చాలడం లేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గని ఉల్లి ఘాటు

బంగాళాఖాతంలో అల్పపీడనం, క్రమేపీ బలపడి వాయుగుండంగా మారుతుందనే సమాచారం వినిపిస్తే చాలు మార్కెట్లో కూరగాయల ధరలకు రెక్కలొస్తున్నాయని కొనుగోలుదారులు విమర్శిస్తున్నారు. ఉన్నంతలోనే సర్దుకుపోదామనుకునే వారికి కూడా గంజి అన్నంలోకి ఉల్లిపాయ లేకుంటే ముద్ద దిగదు. అందుకే ఉల్లికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి ధర కిలో రూ.60 వరకు పలుకుతోంది. రైతుబజార్లలో కూడా రూ.10 అటు ఇటుగా ఉల్లిని విక్రయిస్తున్నారు. ఉల్లిపాయలు ఎక్కువగా సోలాపూర్, కర్నూల్, కడప ప్రాంతాల నుంచి దిగుమతి అవుతుంటాయి. అయితే ఈ ఏడాది భారీ వర్షాలు కురియడంతో ఉల్లి పంట సాగుతోపాటు దిగుబడులు కూడా తగ్గడమే ధర పెరుగుదలకు ప్రధాన కారణంగా స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా చాలామంది దసరా నుంచి సంక్రాంతి వరకు ఎక్కువగా అయ్యప్పస్వామి మాల ధరించి, దీక్షలో ఉంటారు. అలాగే భవానీ మాల, శివ మాలలు కూడా వేసుకుని దీక్షలు చేసేవారు కూడా అధికంగానే ఉంటారు. వీరితోపాటు ఆయా కుటుంబాలలోని వారు దీక్షలు పూర్తయ్యే వరకు కూరల తయారీలో ఉల్లిని దూరంగా ఉంచుతారు. ఈ కారణంగా ఇతర రోజుల కంటే ఉల్లి వాడకం ఒక రకంగా ఈ సమయంలో తక్కువే అని చెప్పాలి. కానీ వినియోగానికి సరిపడా ఉల్లి మార్కెట్‌లోకి రాకపోవడంతో వీటి రేటు పెరిగింది.


సామాన్యులను హడలెత్తిస్తున్న ఉల్లి

ఇతర కూరగాయలదీ అదే బాట..

ఇక మార్కెట్‌లో ఇతర కూరగాయల ధరలను పరిశీలిస్తే, ఉల్లికి తాము ఏమాత్రం తీసిపోమన్నట్టుగా చుక్కలు చూపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో చిక్కుడు ధర రూ.60 ఉంది. శాకాహారులు ఎక్కువగా వాడే చిక్కుళ్లకు డిమాండ్ పెరగడంతో ధర పెరిగిందంటున్నారు. కిలో టమాటా, బెండకాయలు, వంకాయలు రూ. 60 పలుకుతున్నాయి. దొండకాయలు మాత్రం కిలో రూ.30 లోపునే దొరుకుతున్నాయి. బంగాళాదుంప కిలో రూ.35, క్యాబేజీ రూ.45 హోరెత్తిస్తున్నాయి.

ధరలను నియంత్రించాలి



సాధారణంగా అక్టోబర్ నుండి సంక్రాంతి వరకు వచ్చే వివిధ రకాల పండగలతో అదనపు ఖర్చులు ఉంటాయి. ఈ సమయంలోనే కూరగాయల ధరలు కూడా పెరగడం ఒక రకంగా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం జోక్యం చేసుకుని, రైతుబజార్ల ద్వారా తక్కువ ధరకు అందిస్తే బాగుంటుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ విధంగా చేసి సామాన్యులకు ఆర్థిక భారం పడకుండా చూసేవారు.

– పొన్నపల్లి వెంకటలక్ష్మి, గృహిణి, సూర్యారావుపేట

డిమాండ్‌కి తగ్గట్టుగా ఉత్పత్తి లేకనే ..



ఏ వస్తువుల ధరలైనా మార్కెట్‌లో ఉన్న డిమాండ్ మేరకు సప్లయి లేకపోవడంతోనే పెరుగుతాయి. ప్రజల అవసరాల మేరకు ఉత్పత్తి, సప్లయి పెంచేలా చర్యలు తీసుకుంటే ధరల పెరుగుదల సమస్య చాలావరకు తగ్గుతుంది.

– ఓదూరి గాంధీ, కూరగాయల వ్యాపారి, రాజానగరం

మద్యాన్ని నిషేధించాలని కోరుతూ ప్రదర్శన


రాజానగరంలో ప్రదర్శన చేస్తున్న ఏపీ రైతు కూలీ సంఘం ప్రతినిధులు

రాజానగరం: ఎంతోమంది పేదల బతుకులను, వారి కుటుంబాలను సర్వనాశనం చేస్తున్న మద్యపానాన్ని నిషేధించి, సమాజాన్ని కాపాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజానగరంలో శుక్రవారం ప్రదర్శన జరిగింది. కూటమి ప్రభుత్వంలో అమలు చేస్తున్న నూతన పాలసీతో మద్యం ఏరులై పారుతుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు విమర్శించారు. దేవాలయాలు, పాఠశాలలకు దూరంగా మద్యం దుకాణాలు ఉండాలని నిబంధనలున్నాగాని వాటిని తుంగలోకి తొక్కి మరీ వ్యాపారాలు యధేచ్ఛగా సాగిస్తున్నారన్నారు. నూతన పాలసీతో బెల్ట్ షాపులు కూడా భారీగా పెరిగిపోతున్నాయని, మంచినీరు దొరకడం కష్టమవుతుందేమోగాని, మద్యం మాత్రం ఎక్కడబడితే అక్కడ లభిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి అంటే ఇదేనేమోనని హేళన చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, రాయుడు కన్నబాబు, ముసలి బాబు, భూషణం, సత్తిబాబు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో పురుగుల నిర్మూలన


కోటికేశవరం గ్రామంలో నీలి రంగు బుట్టల వినియోగాన్ని ప్రదర్శిస్తున్న శ్రీకాకుళం వ్యవసాయ విద్యార్థులు

మధురపూడి: వరి పంటకు సోకుతున్న తెల్లదోమ, రసంపీల్చే పురుగులను లింగాకర్షక బుట్టలు ఉపయోగించడం ద్వారా నివారించుకోవచ్చని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం ఏరువాక కేం ద్రం ఆధ్వర్యంలో కోరుకొండ మండలం కోటికేశవరం గ్రామంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి శ్రీకాకుళంలో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు వరి పంటను సంరక్షించుకోవడం ఎలా అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. తెల్లదోమ, రసం పీల్చే పురుగుల కారణంగా నష్టపోతున్నట్టు రైతులు వాపోయారు. దానికి పరిష్కార మార్గంగా విద్యార్థులు ఎకరానికి 4–5 లింగాకర్షణ బుట్టల ద్వారా సమస్య పరిష్కారం అవుతోందన్నారు. నైరా బీఎస్సీ విద్యార్థులు జి. మహేష్, బి. వంశీ, సీహెచ్ నవీన్, కె.సాయికిరణ్, ఏరువాక కేంద్రానికి చెందిన డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి


అనపర్తిలో బాణసంచా దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ సుమంత్

పెదపూడి: దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే బాణ సంచా దుకాణాలకు తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని అనపర్తి సీఐ సుమంత్ అన్నారు. అనపర్తిలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. దుకాణ దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్సు పొంది దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి దుకాణాలు ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనపర్తి ఎస్సై ఎల్ శ్రీను నాయక్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీనివాసారెడ్డి పాల్గొన్నారు.

పెదపూడి: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే బాణ సంచా దుకాణాలను నిర్వాహకులు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ పీ.వీ.సీతాపతిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, నిర్వాహకులకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాణసంచా దుకాణాల ఏర్పాటుకు తప్పనిసరిగా లైసెన్సు ఉండాలన్నారు. బాణసంచా దుకాణాలు జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.నరేంద్ర రెడ్డి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కంకరటింకర రోడ్డు!

తహసీల్దార్ కార్యాలయానికి నడచి వెళ్లాలంటే... కాలికి గాయాలే


ఇబ్బంది కల్గిస్తున్న కోరుకొండ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారి

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ తహసీల్దార్ కార్యాలయానికి నడచి వెళ్లాలంటే కాళ్లకు కంకర గుచ్చుకుని గాయాలవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీసు స్టేషన్ రోడ్డు నుంచి కార్యాలయం వరకు కంకర వేశారు. చాలా రోజుల క్రితం వేసిన దాన్ని చదును చేయడం మరిచారు. దీంతో కార్యాలయానికి వచ్చే సామాన్యులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలికి చెప్పులు లేకపోతే గాయాల పాలవ్వాల్సిందేనని వాపోతున్నారు. ఈ రోడ్డుపై వాహనాలలో సైతం ప్రయాణించడం ఇబ్బందిగా ఉంది. త్వరగా రోడ్డు నిర్మాణం చేయాలని తహసీల్దార్ సుస్వాగతంను పలువురు కోరుతున్నారు.

అసలేం జరిగిందంటే..

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అనుయాయులు గతంలో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలకు ఉపయోగించే మైనింగ్ (కంకర రాళ్ల)ను అక్రమంగా తరలి స్తున్న భారీ వాహనాలను అడ్డుకున్నారు. నగదు చెల్లించినట్టు బిల్లులు లేకపోవడంతో కార్యాలయానికి తరలించారు. ఆ సందర్భంగా వాహనాలు అప్పటికే ఉన్న గేటును ఢీకొట్టడంతో గేటు ఊడిపోయింది. అలాగే కార్యాలయానికి వెళ్లే మార్గం గోతుల మయమయ్యింది. గేటు ఏర్పాటుతో పాటు, దారికి మరమ్మతుల పనుల్లో భాగంగా కంకర వేశారు. కాని రోడ్డు రోలర్‌తో సరిచేయడం మరచిపోయారు.

రీసర్వే గ్రామసభలను వినియోగించుకోండి


చింతపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతాపతిరావు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వే గ్రామ సభలతో భూ సమస్యలకు చెక్ పెట్టినట్లు అవుతుందని తహసీల్దార్ పీ.వీ. సీతాపతిరావు అన్నారు. చింతపల్లి గ్రామంలో శుక్రవారం రీ సర్వే గ్రామ సభ సర్పంచి కొల్లు లోవ కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సీతాపతిరావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించే రీ సర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సభలో 32 అర్జీలు అందాయన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కొల్లు సత్తిబాబు, పైన వీర వెంకట సత్యనారాయణ, వీఆర్వోలు వెలగల మహాలక్ష్మి, గొల్లపల్లి అంజిబాబు, పంపన శ్రీనువాసు, నాగేంద్ర, సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శి రాయుడు సాగర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

రంగంపేట: ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని అప్పుడే ఎలాంటి వ్యాధులు దరి చేరవని గ్రామ సర్పంచ్ నల్లా పద్మ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నల్లమిల్లి గ్రామంలో పారిశుధ్య పనుల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో డ్రైనేజీలు, మురుగు నీటి కాలువలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా చదువులు కొనసాగించాలి

కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ

పెదపూడి: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా గ్రామానికి, దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాలని కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కె.వి.వి.సత్యనారాయణ అన్నారు. జి.మామిడాడ గ్రామంలో శుక్రవారం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పలు రికార్డులు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి, విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించు కోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కోరాడ శ్రీనివాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న క్యాన్సర్ అవగాహన సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం, నివారించడం, చికిత్స చేయడం గురించి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా నవంబర్ 7న రాజమహేంద్రవరం కోటగుమ్మం సెంటర్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, అధికారులతో నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలపై సమావేశాన్ని నిర్వహించారు. సొసైటీలో సభ్యత్వాలు పెంచే చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ జక్కంపూడి విజయలక్ష్మి, డీఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాడి అభివృద్ధిపై దృష్టి సారించాలి

బిక్కవోలు: పాడిని నిరంతరం అభివృద్ధి చెందే దిశగా తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం బిక్కవోలు పశు వైద్య శాల వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, పశుగణాంక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు పంట ఎంత ముఖ్యమో పాడి కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రస్తుత పరిస్థితిలో పాడి పశువుల్ని పెంచటం కష్టతరంగా మారిందన్నారు. పశు సంవర్ధక శాఖ అధికారి టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో పశు గణన కార్యక్రమం ప్రారంభం అయిందన్నారు. ప్రతి రైతు ఇళ్ల వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించి వివరాలు తెలపాలని కోరారు. కార్యక్రమంలో అనపర్తి పశు సంవర్ధక శాఖ అధికారి వై.శ్రీనివాసరావు, డాక్టర్ ప్రణీత్, ఎంపీడీవో శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గొర్రెల త్రిమూర్తులు, నాయకులు పాల్గొన్నారు.

సంపర విజయదుర్గ అమ్మవారికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ అమ్మవారు

పెదపూడి: సంపర గ్రామంలో కొలువు తీరిన విజయదుర్గ అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకాలతో పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు అమ్మవారికి ఉదయం విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అమ్మవారిని దర్శించుకొని సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విజయ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


రంగంపేటలో కొలువైన విజయ దుర్గాదేవి

రంగంపేట: రంగంపేట మంచినీటి చెరువు వద్ద కొలువై యున్న విజయ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సత్వరమే నీటి తీరువా వసూలు చేయాలి

సీతానగరం: మండలంలో నీటి తీరువా బకాయిలన్నింటిని సత్వరమే వసూలు చేయాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ వీఆర్వోలకు సూచించారు. శుక్రవారం సీతానగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 2024 అక్టోబర్ నాటికి చెల్లించవలసిన నీటి తీరువా బకాయిలన్నీ జాగ్రత్తగా వసూలు చేయాలన్నారు. ప్రస్తుతం జరుగనున్న నీటి సంఘం ఎన్నికల దృష్ట్యా నీటి తీరువా బకాయిలన్నీ చెల్లించవలసి ఉందని, సీతానగరం మండలంలో గల గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ గ్రామ రెవెన్యూ సహాయకులతో కలిసి నీటి తీరువా వసూళ్ల విషయమై డిమాండ్ నోటీసులు జారీ చేసి, వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. నీటి తీరువా చెల్లింపులు గ్రామ సచివాలయాల ద్వారా జరుపవలసి ఉన్నందున, డిజిటల్ అసిస్టెంట్లు గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉండి, చెల్లింపులు సకాలంలో జరపడానికి సహకరించాలన్నారు. మండలంలో నీటి తీరువా బకాయిలు చెల్లించవలసిన రైతులు అందరూ పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ చెల్లించవలసిందిగా తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు.

వ్యవసాయశాఖలో పదోన్నతులు

సీతానగరం: సీతానగరం మండల వ్యవసాయశాఖలో పలువురికి పదోన్నతులు దక్కాయి. సీతానగరంలో వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేస్తున్న పీవి శ్రీనివాస్ వ్యవసాయ అధికారిగా పదోన్నతి పొందారు. ఈయన పెద్దాపురం ఏడీఏకు పీఏగా ఉద్యోగ బాధ్యతలు చేపడతారు. చినకొండేపూడి రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలుగా పని చేస్తున్న ఎస్.గురుప్రియ సీతానగరం మండల క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారిగా పదోన్నతి పొందారు. కోరుకొండ మండలం గాడాల గ్రామం వ్యవసాయ సహాయకుడిగా పని చేస్తున్న సామ్‌సన్ కోరుకొండ క్లస్టర్‌కు వ్యవసాయ విస్తరణాధికారిగా పదోన్నతి పొందారు.

విత్తన శుద్ధితో పంటలకు జీవం

రంగంపేట: రంగంపేట రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం రైతులకు పంటల తెగుళ్లపై ఆర్ఏడబ్ల్యూఈపీ విద్యార్థినులు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి చేయడం వలన వేరు ద్వారా సోకే వేరు కుళ్లు, కాండం కుళ్లు తెగుళ్లు రాకుండా పంటను కాపాడవచ్చునన్నారు. ప్రతి రైతు విత్తన శుద్ధి తప్పకుండా చేసుకొని పంటలను చీడ, పీడల బారి నుంచి కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు నాగమణి, శ్యామల, చెరిష్మా, సునీత, ఎర్రయ్యమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకుడు మహేష్, రైతులు పాల్గొన్నారు.

కెనాల్ రోడ్డు మరమ్మతులకు భూమి పూజ


రాజమహేంద్రవరం-కాకినాడ కెనాల్ రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డి

పెదపూడి: రాజమహేంద్రవరం–కాకినాడ కెనాల్ రోడ్డు పనులు నిబంధనల ప్రకారం చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలో ఆయన శుక్రవారం రాజమహేంద్రవరం–కాకినాడ కెనాల్ రోడ్డు మరమ్మతు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.6.35 కోట్ల నిధులతో బిక్కవోలు మండలం జోడు నాదాల తూమ నుంచి కడియం వరకు ఈ రోడ్డుకు మరమ్మతు పనులు చేపడతారన్నారు. ఈ రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన అమలు చేయడానికి రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం మరమ్మతులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు. అనపర్తిలో నియోజకవర్గ స్థాయిలో మండల స్థాయి అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. 21వ అఖిల భారత పశు గణన వాల్‌పోస్టర్, స్టాంప్స్‌ను ఆయన ఆవిష్కరించారు.